# — సౌందర్యానికి ఆహుతి

బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

తలంటుకుని దూముడి వేసుకున్న వెంకమ్మ శిరోజాలు ఆమె తలకు మాత్రమే గాదు మనిషి మొత్తానికే ఎంతో ఆనందాన్నిస్తున్నాయి. మొహానికి తగిన విశాల నేత్రాలలోని నల్లని పాపలు బుల్లిపాపాయిల కన్నా స్నిగ్ధంగా ఉన్నాయి. మువ్వలగుత్తి బేసరి పెట్టుకున్న ఆ ముక్కు చెప్పటానికి వీలులేనంత హాయిగా ఉంటుంది. మనిషి చామనచాయలో కుదిమట్టమైనది. సర్వతంత్ర స్వతంత్రురాలని జనం.— పెనిమిటి నాగమణి అమాయకుడు—లోకానికి ఇహ కావలసినన్ని కలలూ, కథలూ.

ఇంటిపక్క బుచ్చిరామయ్య కోడె వయసులో అందగాడు- అత్తా అత్తా అనుకుంటూ వీరింటికి తరుచు వస్తోంటాడు.

నాగమణి మేనల్లుడు కొంటె కోణంగి. కొంచెం ఇంగ్లీషు ఎంగిలి పడ్డవాడు. పిలవని పేరంటంగా వచ్చిపోవటం ఉన్నది.

పాలేరు రాముడు కండలు తిరిగిన దండలతో నలుపులు కక్కుతూ రాత్రింబగళ్లూ ఇంటో స్వేచ్ఛగా మెలుగుతూ ఉంటాడు.

వీళ్ళ ముగ్గిరికీ ఒహాళ్లమీద ఒహాళ్లకి చెప్పతరంగాని అనుమానం.

ఆయా సందర్భాలను బట్టి వీళ్లు ముగ్గురూ ఒకళ్లకి తెలియకండా ఒకళ్లు వెంకమ్మ వ్యభిచరిస్తున్నదని నాగమణికి నూరిపోశారు.

ఈగడ్డమీద వున్న రివాజుప్రకారం భార్య పరాయివాణ్ణి కన్నెత్తి చూసిందంటేనే ఎంత చాతగానివాడైనా, పొడుస్తాను- కరుస్తాను- అనడమో- చేయడమో వున్నది గదా. నాగమణి మటుకో!

ఈ ముగ్గురూ ఒకరికి తెలియదని ఒకరు నాగమణి పక్షాన నిల్చారు. విషయం లోకానికి గంతలు కట్టామని ఎవరిమటుకు వారి ఊహ.

లోకం కాకై కూస్తోంది. ఏమని?

ఒకసారి పాలేరు రాముడితో, ఇలాగనీ;

ఇంకోసారి ఇంకోరు బుచ్చి రామయ్యాకూ ఈమెకూ సంబంధమనీ;

మరోరు, మేనత్తా మేనల్లుడూ అనీ.

ఇందులో ఏది నిజం?

నిజానికి ఏది నిజమైతే నేం?

కాదు-—

ఈ మాటే లోకులూ అంటారు, గట్టిగా నిగ్గదీస్తే విడివిడిగా.

అసలు మూలం: పరాయివాళ్ళను గురించీ, పరాయిసంగతుల్ని గురించీ సిద్ధాంతరాద్ధాంతాలు చెయ్యటం తమధర్మ మనుకునే స్వాత్మజ్ఞానవిహీనులు 'కో' అంటే కోటిమంది హాజరు.

నాగమణి పెళ్ళాంతో బెరుగ్గా ఉంటం— ఆమె చూడకుండా పండ్లుకొరకటం—ఇంటికి చుట్టుకున్న ముగ్గురు మరాఠీలతోనూ ఆమెను వెళ్ళగొడ్తాననటమూ సాగించాడు.

వెంకమ్మ ఈ సంగతంతా కనిపెట్టింది. తనను భర్త అదిలించలేడనీ, తనకే లొంగి వుంటాడనీ ఆమెకు నిండు ధైర్యమే. రోజుకురోజు గడిచిన కొద్దీ వీళ్ళ కార్పణ్యాలు అడవుల్లా పెరిగిపోతున్నాయి.

పాలేరు రాముడు దారికాచి ఓ.నాడు చీకటి పడి వస్తోన్న మేనల్లుణ్ణి తల పగిలేట్టు కొట్టాడు. పోలీసులూ, వ్యవహారం తదంగం అంతా అనుకోండి. కమ్యూనిస్టులేనని ఖాయమైంది. దీంతో రాముడికి ఎన్నోగుండెలొచ్చాయి.

వారం తిరిగిరాలేదు. బుచ్చిరామయ్య రాత్రి భోంచేసి వీళ్ళింటికివచ్చి చుట్ట కాల్చుకుని ఆ మాట ఈమాటా పొద్దుపోయిందాకా మాట్లాడి వెడుతోంటే వాకిలి తలుపు చాటుగా నక్కి వుండి ఫెడేలున మొహం తలా బద్దలయ్యేట్టు కొట్టాడు రాముడే! బుచ్చిరామయ్యకుకళ్లు తిరిగిపోయి ఎవరో తెలుసుకోలేకపోయినా 'దొంగలు' అని ఒక్కసారి పెద్ద పెట్టున అరిచి పడిపోయాడు, కాని ఒక్కనర పురుగు రాలేదు.

వీళ్ళిద్దరూ చావల. కాని కట్లతో, గాయాల్తో మంచం పట్టారు.-మళ్ళా పోలీసులూ పంచాయితీ. ఏక్కడా ఏమీ ఆచోకీ అయినా దొరికిందిగాదు. కాని-వెంకమ్మకోసం కమ్యూనిస్టులు చూపేశారనీ, వీళ్ళెప్పుడో వాళ్ళకు అడ్డమైతే ఈపని చేశారనీ, వెంకమ్మ ఇంటిమీద ఒక చూపుతో ఉండాలనీ, పోలీసులు నిర్ణయానికి వచ్చారు!

ఎంత అమాయకుడైనా నాగమణి ఈ గాథంతా రాముడే తన పెళ్ళాంమీద ఆపేక్షతో చెశాడని పసికట్టాడు. పోనీ పోలీసులకు చెప్పకూడదా అంటే అంతటి ధైర్యమూ చెయ్యలేక పొయ్యాడు-తనను తనే బైట పెట్టుకోట మెందుకు, దారికిరాకపోతుందా అనీ. ఏమైనా లోపల పొంగే కోపానికి తమాయించుకోలేక పోతున్నాడీసారి! కాని లౌక్యం తెలియదు. ఒనాడు వాకిట్లో నిద్రపోతోన్న రాముణ్ణి అర్థరాత్రివేళ పోటకత్తితో గుండెల్లో పొడిచాడు నాగమణి! రాముడు వేసిన కొండ కేకలకు ఊరు ఊరంతా హడలిపోయింది! కాని ఒక్కరూ రారు! వెంకమ్మ వాకిట్లోకి వచ్చింది! ఈ భీభత్సమంతా చూసింది! నెత్తురు చూసేసరికి వెంకమ్మ కళ్లు బైరలు కమ్మినై! రాండి రాండి. దొంగ దొరికాడు అని ఎలుగెత్తి కేకలు పెట్టింది-వారం రోజులలో రెండు దెబ్బలైనై. ఇది మూడో దెబ్బ-ఎవరూ ధైర్యం చేసి రాలేకపోయారు, "ఇంత పిరికిపందలేం! ఎన్నిసార్లు ఛస్తారు? రాలేం-చావుకు జడిసి సందుగొందుల నక్కుతున్నారా?" అంటూ ఆ ఆవేశంలో గొంతు చీల్చుకుంది, ఎక్కడా ఒక్క కాలిజాడా లేదు. రాముడూ అనిపిలుస్తూ వాడి గుండెల్లో గుచ్చుకునిఉన్న పోట కత్తి లాగింది. రాముడు ఒక్కసారే కళ్లు తెరిచి చూశాడు! వెంటనే అదే కత్తితో నాగమణి మెడమీద బలంగా ఒకే ఒక వేటు వేసింది! నాగమణి నేల కొరిగాడు!... వెంకమ్మవలెనే కోడిగొంతు చీల్చుకుని 'కో' అని అరచింది.

ఎప్పుడు తెల్లారుతుందా, అని ఊరివాళ్లంతా ప్రాణా లరచేతులో పెట్టుకుని ఉండగా... !

తూరుపు కొండమీద నెత్తురు పారింది ఎవరిదో.

పనివాళ్లూ-పాటవాళ్లూ రాకపోకలు సాగించారు వీధిలో.

వెంకమ్మ గుమ్మంలో రెండు పీనుగులు. ఎక్కడవిన్నా నల్గురూ ముగ్గురూ కూడి ఇదే గుసగుస. మళ్ళీ పోలీసులు... వెంకమ్మ వీళ్ళిద్దరి కధా ధైర్యంగా చెప్పేసింది - వాళ్ళిద్దర్నీ కొట్టిం దెవరో నాకు తెలీదన్నది! వెంకమ్మను అరెస్టు చేశారు.

రెండు సంవత్సరాలకి వెంకమ్మకు ఉరిశిక్ష విధించారు.

బుచ్చిరామయ్యా - మేనల్లుడూ తేరుకుని, బాగుపడి ఈమెతరఫున కొంత వ్యవహరించారు. పరస్పరానూయలతోనే.

కాని, లోతు విచారిస్తే వెంకమ్మ అందానికి బలి అవక తప్పిందిగాదు! ఇప్పుడా యింటి ముందుగా వెళ్ళటానికి ప్రతివాడికీ భయం! ఆ యింట్లో చచ్చిన యిద్దరూ దయ్యాలైనారనీ, పట్టి పీక్కు తింటారనీ.

నిన్నటిదాకా దారిన పోయ్యేవాడికి ఒక మధురదృష్టి ఆ యింట్లోకి! ఇప్పుడు అతిభయం.

వెంకమ్మ ఉరికంబం ఎక్కుతూ నా ఆస్తి నా మేనల్లుడికీ, బుచ్చిరామయ్యకీ చెందజెయ్యమని సర్కారు వారిని కోరింది.

ఎన్నాళ్ళదాకానో ఆ ఊరు, దాని చుట్టుపట్టు గ్రామాల ప్రజలకు ఈరకం కథలు!...

వెంకమ్మను బాగా ఎరిగిన వాళ్లంటారు, వెంకమ్మ నిర్దుష్టురాలనీ, ఆమె సౌందర్యమూ ఆమె సాహసమూ ఆమెకు ఉరైనవనీ.

లోకానిదేముంది. ఏదంటే అదే నిజం.

లోకానికి తెలియనిదీ - తెల్సుకోజాలనిదీ ఒక్కటే.

అది : నిజం!

ఏ సౌఖ్యమైనా క్షణికమన్నంత మాత్రాన అది చెడ్డదని రూఢి కాదు: మనిషి అనంతకాలం వరకూ అనుభవించేదంటూ ఏది ఉంది?

—సోమర్‌సెట్ మాఘమ్.